# అవధూత లీల

## అధ్యాయము - 18

## దేంతో పీకులాడే వాళ్ళు దాంట్లోకే



"స్వామీ! మానవుడు చనిపోయాక ఏమౌతాడు?
మరలా మనిషిగా పుట్టి, పాప పుణ్యాలు అనుభవిస్తాడా?"
అని అడిగిన వారితో శ్రీస్వామివారు క్లుప్తంగా **"దేంతో**
45 **పీకులాడే వాళ్లు దాంట్లోకి పోతుండ్లాయ్యా"** అని సెలవిచ్చారు.

చివరి క్షణంలో జీవులు దేనిని స్మరిస్తాయో వాటినే పొందుతాయని భగవద్గీతాది శాస్త్రాలు చెపుతున్నాయి. జీవితాంతం లౌకిక వ్యవహారాల్లో కొట్టుకులాడే సామాన్య మానవులకు చివరి ఘడియలలో అట్టి స్మృతులే కలుగుతాయి. కానీ పూర్వ పుణ్యం వలన మహనీయుల నాశ్రయించినవారు నిరంతరం వారి స్మరణ, సేవలలోనే తమ జీవితాన్ని గడుపుతారు. అట్టివారికి సహజంగా అంతిమ శ్వాసలో అటువంటి శుభమైన స్మృతులే కలుగుతాయి.

**మన శాస్త్రాలు, విద్యలను పరవిద్య, అపరవిద్య అని రెండు**
**వర్గాలుగా విభజించారు. మోక్షాన్నిచ్చే విద్యను పరవిద్య అని, మోక్షగాములు**
**వాటి నాశ్రయించాలని చెప్పారు. జ్యోతిష్యము, వ్యాకరణము మొదలగునవి**
**అపర విద్యలు. ఇవి బహిర్ముఖములు, ఐహికములు గనుక మోక్షమునకు**
46 **ప్రధానము కావని చెప్పారు. ఇవి మానవుని భ్రాంతిలో పడవేసి**
**అధోగతిపాలు చేస్తాయని చెప్పారు. కనుక ముముక్షువు వీటిని**
**పట్టించుకోకుండా తన దృష్టినంతటిని సద్గురువు పై నిలపాలని చెప్పారు.**
**ఇందుకు చక్కని ఉదాహరణ శ్రీస్వామివారి చరిత్రలో కాన వస్తుంది.**

నాగులవెల్లటూరుకు చెందిన సోంపల్లి రామానాయుడు జ్యోతిషశాస్త్రమును అభ్యసించి ఎక్కువ కాలం శ్రీస్వామివారి చెంతనే గడిపేవాడు. అతడా విద్యలో ప్రావీణ్యం కావాలని శ్రీస్వామివారి నాశ్రయించాడో ఏమోగాని, కొంత కాలానికి ప్రశ్నలు చాలా చక్కగా చెప్పేవాడు.

ఒకసారి ఒకరి నెక్‌లెస్ పోతే ఆయన లెక్కవేసి, వారింటి తాటాకు దడిలో దాచారని చెప్పాడు. దడి విప్పితే అందులో నుండి నెక్‌లెస్ క్రింద పడింది. తప్పిపోయిన బఱ్ఱెను గూర్చి ప్రశ్నించిన వారితో "మీ ఊరికి ఉత్తరాన మూడు మైళ్లలో ఉన్న గ్రామానికి ఎల్లుండి సూర్యోదయమప్పుడు వెడితే దొరుకుతుంది" అని చెప్పాడు. సరిగా ఆ సమయానికి ఆ ఊరికి వెతకటానికి వెళ్లిన మనిషికి ఎదురుగా ఒక ఇంట్లోంచి ఆ గేదె బయటికి వచ్చింది.

ఒకసారి శ్రీస్వామివారు పర్యటనకు వేరొక ఊరికి బయలుదేరుతుండగా రామానాయుడు "స్వామి, నా వంట్లో బాగాలేదు. నేనిక్కడే వుంటాను" అన్నాడు. శ్రీస్వామివారు అంగీకరించి వెళ్లిపోయారు. తరువాత రెండవ రోజున రామానాయుడు ఆశ్రమంలో మరణించాడు. ఆ వార్త శ్రీస్వామివారికి తెలిపితే అతడి దేహాన్ని ఆశ్రమంలో ఒక ప్రక్కన సమాధి చేయమని శ్రీస్వామివారు కబురు చేశారు. భక్తులలానే చేశారు.

ఆ సమాధి ప్రక్కనే శ్రీస్వామివారి భక్తుడైన పోలిరెడ్డి సమాధి కూడా ఉన్నది. పోలిరెడ్డి ఎప్పుడూ శ్రీస్వామివారిననుసరించి సేవిస్తుండేవాడు. శ్రీస్వామివారు ఎక్కడ విడిది చేసినా అతడు వెంటనే ఆ ప్రాంతంలో వెదకి ఆకుకూర సేకరించి, వండి శ్రీస్వామివారికి పెట్టేవాడు. కారణం శ్రీస్వామివారు ఆకుకూరను ఎక్కువ ప్రీతిగా తినేవారు. అంతకు మించి అతడు శ్రీస్వామివారి నుండి కోరిందికానీ, పొందినదిగానీ ఏమీ కనిపించదు. కానీ అతడు చనిపోవడానికి నలభైరోజులు ముందుగా శ్రీస్వామివారు భక్తులతో, "నేటికి నలభైరోజులకు భగవంతుడు విచారణకు వస్తాడు. మనమందరమూ ఆ రోజు గంగైనా ముట్టకూడదు" అన్నారు. వారి భావమేమో ఎవ్వరికీ అర్థంగాలేదు. సరిగ్గా ఆరోజుకు మైపాడులో ఉన్న శ్రీస్వామివారు, "అయ్యా, మనం ఆశ్రమం చేరినదాకా నేనేగాదు, మీరు కూడ గంగను ముట్టకూడదు. మనం వెంటనే గొలగమూడి చేరాలి. పదండి" అన్నారు. వర్షాల వల్ల ప్రయాణ సౌకర్యం లేకపోయినప్పటికీ ఆయన సేవకులను తొందరచేసి కాలి నడకన నెల్లూరు చేరి మధ్యాహ్నానికి కారులో గొలగమూడి చేరారు. నాటి ఉదయమే ఆశ్రమంలో పోలిరెడ్డి పరమపదించాడు. అతడికి అంత్యక్రియలు ఎక్కడ, ఎలా చేయాలని భక్తులు తర్కించుకుంటున్నారు. శ్రీస్వామివారిని విచారించడానికి ఆయన ఎక్కడున్నదీ వారికి తెలియలేదు. కాని శ్రీస్వామివారికి తెలియనిదేమున్నది?

పోలిరెడ్డి మరణించిన సమయానికే శ్రీస్వామివారు సేవకులను ఆశ్రమానికి బయలుదేరదీశారు. తర్వాత ఆశ్రమంలో ఆయనే స్వయంగా పోలిరెడ్డి దేహాన్ని సమాధి చేశారు.

పోలిరెడ్డి అంత్యక్రియల పట్ల అంత శ్రద్ధ వహించిన శ్రీస్వామివారు జ్యోతిష్యములో ప్రావీణ్యం గడించిన రామానాయుడు చనిపోయినపుడు ఆశ్రమానికి ఎందుకు రాలేదని భక్తులీనాటికీ తర్కించుకుంటున్నారు. శ్రీస్వామివారి సేవను తప్ప ఏమీ కోరని అనన్యమైన గురుభక్తుడు, ముముక్షువు పోలిరెడ్డి. శ్రీస్వామివారు స్వయంగా అతని దేహాన్ని సమాధి చేయటం, అతడికి ఆయన నిశ్చయంగా సద్గతిని ప్రసాదించారనడానికి నిదర్శనం. రామానాయుడు శ్రీస్వామివారి నుండి జ్యోతిష్య విద్యను మాత్రమే ఆశించిన అర్థార్థి. అయితే పూర్వపుణ్యం వలన ఆ మిషమీద అతడిని పరమ పవిత్రమైన శ్రీస్వామివారి ఆశ్రమంలోనే సమాధి చేయమన్నారు శ్రీస్వామివారు. శ్రీ సాయి చరిత్రలో గూడా వారి నుండి ఏమీ ఆశించకనే అనన్యంగా సేవించిన మేఘుని గురించి సాయి, "వీడే, నా అసలైన భక్తుడు" అని ప్రశంసించి అతని దేహంతో గూడ స్మశానం వైపుకు కొంత దూరం నడచి వీడ్కోలు చెప్పడమేగాక తమ స్వంత ఖర్చుతో భక్తులకు సాయి సంతర్పణ చేయించారు. ఏమీ కోరని సేవే భక్తి.

నెల్లూరు వాస్తవ్యులు ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగారికి ఒక పెంపుడు కుక్క వుండేది. దాన్ని వారెంతో ముద్దుగా చాకేవారు. ఆ కుక్కకు జబ్బు చేస్తే డాక్టరు వల్ల నయంగాక శ్రీస్వామివారి చెంతకు కారులో తీసుకొచ్చారు. శ్రీస్వామివారు కుక్కను, కుక్క శ్రీస్వామిని ఒకరొనొకరు చూచుకున్నాక ఆ కుక్క ప్రాణాలు వదిలింది. శ్రీస్వామివారి సన్నిధిలో ప్రాణాలు వదిలిన జీవికి తప్పక సద్గతి లభిస్తుంది. సాయి చరిత్రలో సాయినాథుని దర్శించి ఒక పులి తన ప్రాణాలు విడిచినట్లుందీ సన్నివేశం.

కొట్టికూటి నరసింహులునాయుడు (గొలగమూడి), వీరి భార్య అనేక సంవత్సరములుగా శ్రీస్వామివారి భక్తులు. శ్రీస్వామివారి మాటపై అచంచలమైన విశ్వాసంగలవారు. ఒకప్పుడు శ్రీస్వామివారు వీరిని ఒక్క సంవత్సరం రోజులు గొలగమూడి వదలి పడమటి రాజ్యం పొమ్మని ఆజ్ఞాపించారు. వీరలాగే ఇల్లు వాకిలీ వదలి శ్రీస్వామివారు మరలా రమ్మని చెప్పినంత వరకూ తలుపూరులో పూరిపాక వేసుకొని సంతోషంగా కాలం

వెళ్ళబుచ్చారు.

1983 లో నాయుడుగారి భార్యకు కాన్సరు వ్యాధి వచ్చింది. డాక్టర్లకు చూపిస్తే వారు ఆశ వదలివేశారు. శ్రీస్వామివారిని శరణుజొచ్చి విభూతి వాడుతున్నారు. శ్రీస్వామివారి భక్తులు బుజ్జన్నగారు స్వామివారి సమాధికి దారం తాకించి ఇస్తే ఆ దారం కట్టి సాంబ్రాణి పొగ వేయించి, స్వామి విభూతి నీటిలో కలిపి ఇప్పిస్తూ శ్రీస్వామివారిని ప్రార్థించారు.

ఆనాటి రాత్రి బుజ్జయ్యగారి స్వప్నంలో ఆమెను బ్రహ్మాండమైన పాడెపై పెట్టి అలంకరించినట్లు, పెద్ద పూలమాల వేసినట్లు ఆమె ముఖం బెజవాడ కనకదుర్గమ్మ ముఖం వలె వెలుగుతున్నట్లూ కనిపించింది. తెల్లవారి ఆమె మరణించింది. శ్రీస్వామివారు ఆమెను రక్షించలేదని బుజ్జన్న మొదలైన భక్తులనుకుంటారని, ఆమెకు ఆయువు తీరిందని, ఏమి చేయుటకు వీలులేదనీ వీరికి ఆ స్వప్నం ద్వారా తెలిపారు.

ఆమెకు మృత్యుకళ లేకుండా దైవకళతో నున్నట్లు స్వప్నంలో చూపడంబట్టి ఆమెకు శ్రీస్వామివారు ఉత్తమగతి కల్గించారని తెలుస్తుంది.

కల్లూరుపల్లి వాస్తవ్యులు పాబోలు సుబ్బమ్మ చాలా దయగల వ్యక్తి. సర్వజీవులనూ పరమాత్మ రూపాలుగా చూచుకొనే స్వభావం గలది. గ్రామస్తులు ఒక దొంగను పట్టుకొని ఆమె ఇంటి ముందు బండికి కట్టివేశారు. ఆమె రహస్యంగా ఈ దొంగకు పెరుగన్నం పెట్టి కట్లు విప్పి తరిమేసిన దయామయి.

వృద్ధాప్యంలో కలిచేడులో మంచాన ఉండి నిరంతరం రాత్రింబవళ్ళు శిరిడి సాయి నామస్మరణ చేసింది ఆమె. వీరి మనుమడు పి.సుబ్బరామయ్య ఒకనాడు శ్రీస్వామివారిని సిద్దలయ్య కొండ దగ్గర దర్శించాడు. అప్పటికి 2 రోజుల నుండి మౌనంలో నున్న శ్రీస్వామివారు వెంటనే లేచి వీరికొక చీటి వ్రాసి, అభయముద్ర, ఆశీర్వాదమూ వేసి ఇచ్చారు. జావ త్రాగమన్నా త్రాగకుండా మరలా మౌనం వహించారు. మరుక్షణంలో వెంటనే సుబ్బరామయ్య కోసం మనిషి వచ్చాడు. ఇది తెలిసే స్వామి మౌనం చాలించి ఆమెకు సద్గతి కొరకు తమ ఆశీస్సులు వ్రాయించి ఇచ్చారు. ఇంటికి వెళ్ళి, అంత వరకూ ఏమి నోటిలో పోయబోయినా వద్దనే ఆమె బాబా విభూతి, శ్రీస్వామివారి తీర్థము నోటిలో పోస్తామంటే నోరు తెరిచింది. అవి స్వీకరించాకనే

ప్రాణం వదిలింది. నిజంగా ఆమెకు సకల సాధు స్వరూపమైన శ్రీసాయియే శ్రీ వెంకయ్యస్వామివారి ద్వారా సద్గతిని ప్రసాదించారు. అందులోనూ పవిత్రమైన ధనుర్మాసంలో శరీర త్యాగం చేయించారు సకల సాధు స్వరూపుడు శ్రీస్వామివారు.

వల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డిగారు తన తల్లిగారి సద్గతిని గూర్చి ఇలా చెపుతున్నారు.

"మా తల్లిగారైన తులశమ్మగారు శ్రీస్వామివారి సేవకంకితం కాక ముందే చాలా సంవత్సరముల నుండి 'తూర్పున మన అమ్మ వుంది ఆమె మనకు గత ఐదు జన్మల నుండి అన్నం పెడుతుంది. ఇక మీదట మనమంతా ఆమె అన్నం తినాలి' అని శ్రీస్వామివారు చెప్పేవారు. 'ఎవరు స్వామి ఆమె? ఆమె దేవూరు?' అని అడిగితే చెప్పేవారు కాదు. కాలాంతరంలో తులశమ్మ శ్రీస్వామివారి సేవకంకితమైనప్పుడు శ్రీస్వామివారు చెప్పిన అమ్మ ఎవరో భక్తుల కర్థమైంది. ఈమె ఇల్లు, వాకిలి వదలి తన సర్వస్వమూ శ్రీస్వామియేనని సుమారు ఇరవై ఐదు సంవత్సరములు నిరంతరం శ్రీస్వామివారి సేవలో తన జీవితాన్ని పండించుకున్న ధన్యజీవి. ఎప్పుడూ శ్రీస్వామివారు ఈమెను 'అమ్మా, అమ్మా' అని ఎంతో గొప్పగా పిలిచేవారు తమ బృందంలో ఉన్న మిగిలిన ఆడవాళ్లను అలా పిలిచేవారు కాదు. ఈమె యొక్క అనన్యమైన సేవకు ప్రతిఫలంగా వీరికి శ్రీస్వామివారు సద్గతి ప్రసాదించారు.

1. ఈమె శరీరానికి అగ్ని సంస్కారం చేసినపుడు గంధపు చెక్కలు మొదలగు సుగంధ ద్రవ్యములేవీ వాడలేదు. కానీ ఈ మహాతల్లి శరీరం నుండి కవురు వాసనే రాలేదు.

2. పరమపదించుటకు ముందు రెండు నెలల నుండి నిరంతరం ఈమెకు మౌనము (ధ్యానస్థితి) ప్రసాదించారు శ్రీస్వామివారు.

3. చిత్రమైన ప్రేరణ పెట్టి వెంకయ్య, వెంకమ్మ అనే భక్తులను ఆమె సేవకు వినియోగించారు. వీరు ఆమెను కన్నతల్లికంటే ఎక్కువ ప్రీతితో ఆమెనే సాక్షాత్తు శ్రీస్వామివారనే భావంతో సేవించేటట్లు చేశారు శ్రీస్వామివారు.